శనివారం
25 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:99
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

RNI No. APTEL/2008/24928Postal
Registration No.: VZM/22/2020-2022
Period of Renewal

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

తెరుచుకున్న కేదార్‌నాథ్ దేవాలయం..



2 లో

## ఆర్జీకర్ పోరాటాన్ని అణచివేసిన టీఎంసీ



**ఫలితాల తరువాత ఫైళ్లు బయటపెడతాం**
**టీఎంసీ గూండాలకు రాష్ట్రంలో చోటు దొరకదు**
**పశ్చిమ బెంగాల్**
**రెండోవిడత ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ**

కోల్‌కతా, ఏప్రిల్ 24: న్యాయంకోసం ఆర్జీకర్ హత్యాచార బాధితురాలి కుటుంబసభ్యులు చేసిన పోరాటాన్ని టీఎంసీ అణచి వేసిందని ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం ఓ తల్లి నుంచి కూతురిని దూరం చేసిందని దుయ్యబట్టారు. ఆర్జీకర్ కేసు విషయంలో ప్రభుత్వం పూర్తి అమానవీయంగా ప్రవర్తించిందని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ దమ్‌దమ్ పానిహట్‌లో శుక్రవారం జరిగిన రెండోవిడత ఎన్నికల ప్రచా రసభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్జీకర్ బాధితురాలి తల్లి రత్నా దేబ్‌నాథ్‌ను పానిహతి స్థానం నుంచి

## అమరావతి మెట్రోకు రూ.11 కోట్లు



అమరావతి : అమరావతి మెట్రోరైల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.11 కోట్లు కేటాయిం చింది. దీనికి సంబంధించి పరిపాలనా పరమైన అను మతులు ఇస్తూ శుక్రవారం జిఓ నెంబరు 459 విడుదల చేసింది. 2026-27 నాలుగో క్వార్టర్ కింద ఈ నిధులు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిధులను కార్యాలయ నిర్వహణ కోసం కేటాయించింది. ఇందులో కాంట్రాక్టు ఉద్యోగుల జిఐఎ కోసం రూ.3 కోట్లు, అవుట్‌సోర్సింగ్

## అధిక ఆదాయమే లక్ష్యం

**-- 250 ఎకరాల్లో కోకో సిటీ**
**-- వ్యవసాయంపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి : వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ... రైతులకు భద్రత, అధిక ఆదాయానికి చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పొడవునా పంటలు పండించేలా చూడాలని, భూమిని భాగాలుగా విభజించి ఒకే రైతు వివిధ రకాల పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని చెప్పారు. ప్రకతి సాగు కింద చేసే ఉత్పత్తులను సర్టిఫికేషన్‌తో విక్రయించేలా

వివరాలు2లో..

## యుద్ధంలో అణ్వాయుధాలు వాడబోం

**ఇరాన్‌కు సమయం మించిపోతోంది**
**ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ మరో మూడు వారాలు పొడిగింపు: ట్రంప్**
**నరకకూపం వ్యాఖ్యలపై అమెరికా యూటర్న్**



వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అణ్వాయు ధాలు ఉపయోగించబోమని అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అయి తే తమతో ఒప్పందానికి రావాలని.. సమ యం మించిపోతోందని ఆ దేశాన్ని హెచ్చరించారు. ఇజ్రాయెల్, లెబనాన్‌పై కొనసా గుతున్న

వివరాలు2లో..

## డీజిల్‌కు కటకట!

**వ్యవసాయ, వరికోత పనులపై ప్రభావం**
**కర్నూలులో పెట్రోల్ కోసమూ ఎగబడిన జనం**



అమరావతి, : పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాల నేపథ్యంలో కొంతకాలంగా వంట గ్యాస్ కోసం కష్టాలు పడుతున్న రాష్ట్ర ప్రజలకు ఇప్పుడు ఇంధన కష్టాలు కూడా మొదలయ్యాయి. పెట్రోలు, డీజిల్‌కు కొరత లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నప్పటికీ.. రాష్ట్రంలోని పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఇంధన సరఫరాను తగ్గించడంతో బంకుల్లో డీజిల్ నిల్వలు నిండుకుంటున్నాయి. కంపెనీలు ఒక్కో బంకుకు రోజుకు 20 వేల లీటర్ల డీజిల్‌ను మాత్రమే సరఫరా చేస్తుండగా.. అదంతా గంటల్లోనే ఖాళీ అయిపోతోంది. వారం రోజులుగా రాష్ట్రంలోని చాలా బంకుల్లో ఇదే పరిస్థితి..! రాజధాని అమరావతి సహా ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, విశాఖపట్నం, కోనసీమ, కర్నూలు, నంద్యాల తదితర జిల్లాల్లో వారం రోజులుగా డీజిల్ తగినంత దొరకడం లేదు. ఆటోలు, వ్యాన్లు, ఇతర డీజిల్ వాహనదారులు పెద్దసంఖ్యలో బంకుల వద్ద బారులు తీరుతున్నారు. వరి ఎక్కువగా పండించే ఉభయ గోదావరి జిల్లాలతోపాటు కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు తదితర జిల్లాల్లో రైతులు పంట కోత పనుల్లో బిజీగా ఉన్నారు. కీలక సమయంలో ట్రాక్టర్లు, వరి కోత యంత్రాలకు డీజిల్ లభించక వ్యవసాయ పనులపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీంతో పొలాల్లో నిలిచిపోయిన ట్రాక్టర్లు, వరికోత యంత్రాలకు డీజిల్ కోసం వాటి యజమానులు, రైతులు.. పెద్దపెద్ద టిన్నులు, క్యాన్లు తీసుకుని బంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు రొయ్యలు, చేపల

వివరాలు2లో..

## ఆప్‌కు షాక్

**బీజేపీలోకి ఏడుగురు ఎంపీలు**
**ఆపార్టీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసిన రాఘవ్ చడ్డా**



ఢిల్లీ, : ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చడ్డా పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశంలో రాజీనామా ప్రకటించిన చడ్డా, సందీప్ సింగ్, అశోక్ మిట్టల్‌తో కలిసి నేరుగా ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిశారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ పార్టీలో చేరడాన్ని ఆహ్వానించారు. వారికి స్వీట్లు తినిపించారుఆదర్శాలను పక్కన పెట్టినందుకే: చడ్డాఅంతకుముందు మీడియా సమావేశం లో మాట్లాడిన రాఘవ్ చడ్డా ఆమ్ ఆద్మీ పా ర్టీ ఆదర్శాలను పక్కనపెట్టిందన్నారు. దీంతో ఆ పార్టీ నుంచి దూరం వెళుతున్నానని చెప్పారు. తనతోపాటు హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్తా, స్వాతిమాలివాల్, సందీప్ పాఠక్, విక్రమ్ జిత్ సహానీ, అశోక్ మిట్టల్ ఉన్నారని ప్రకటించారు. 2/3 రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆప్‌ను బీజేపీలో విలీనం చేస్తున్నట్లు చడ్డా చెప్పారు. పార్టీకి తన రక్తం ధారపోశానన్నారు. చెమటోడ్చి పనిచేసి ఉన్నతస్థాయికి తీసుకువచ్చానని పేర్కొన్నారుసిద్ధాంతాలు, విలువల కోసం 15 ఏళ్లుగా పార్టీ ఉన్నతికి పాటుపడ్డానని చెప్పారు. గత కొన్నేళ్లుగా ఆ సిద్ధాంతాలు, విలువలను పార్టీ కోల్పోయిందని చెప్పారు. అందుకే ఇక పార్టీలో ఇమడలేక వేరు పడుతున్నానని, ప్రజలకు మరింత దగ్గరవుతా నని ప్రకటించారు. ఈ ప్రకటనతో ఆప్‌లో అలజడి మొదలైంది. ఆప్‌లో పదిమంది రాజ్యసభ సభ్యులుండగా వారిలో ఏడుగురు పంజాబ్, ముగ్గురు ఢిల్లీకి చెందినవారు. పార్టీని వీడిన అనంతరం సంజయ్ సింగ్, ఎన్డీ గుప్తా (ఢిల్లీ), బల్బీర్‌సింగ్ (పంజాబ్)లు

వివరాలు2లో..

## కొత్త జాతీయ రహదారి వివరాలు సమర్పించండి

**-- భూసేకరణపై మూడు శాఖలకు హైకోర్టు ఆదేశం**




అమరావతి :65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్‌అండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్‌ఎఐ విభాగాలను హైకోర్టు ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల

వివరాలు2లో..

## సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

**-- రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీల కొత్త నోటీసు**



## ఆర్జీకర్ పోరాటాన్ని అణచివేసిన టీఎంసీ

మొదటి పేజీ తరువాయి

తమ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబెట్టామని పెద్దఎత్తున ఆమెకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అధికార పార్టీ మహిళా వ్యతిరేకి అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అధికారంలో ఉన్న టీఎంసీ ప్రభుత్వాన్ని ఇక గద్దెదించాలని రాష్ట్రంలోని మహిళలు నిర్ణయించుకున్నారని ప్రధాని చెప్పారు.మహిళలను రక్షిం చడంలో టీఎంసీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తొలిదశలో జరిగిన పోలింగ్ ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకున్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందన్నారు. ఈ భారీ పోలిం గ్ చూసి టీఎంసీలో ఆందోళన మొదలైందన్నారు. రెండోదశ పోలింగ్‌లో కూడా విజ యపతాకం ఎగురవేయాలని ప్రజలకు ప్రధాని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సం బంధించిన ఫైళ్లు ఎన్నికల ఫలితాల తరువా త బయట పెడతామని హెచ్చరించారు.బెం గాల్ విప్లవాల గడ్డ అని మర్చిపోవద్దని బీజే పీ కార్యకర్తలకు చెప్పారు. మే 4న ఫలితాలు వచ్చాక టీఎంసీ గూండాలకు దాక్కోవడానికి రాష్ట్రంలో చోటు దొరకదన్నారు. మమ త ప్రభుత్వం సాగిస్తున్న జంగిల్ రాజ్‌కు ఎం డ్‌కార్డ్ పడే సమయం ఆసన్నమైందని, ఇది మోదీ గ్యారెంటీ అని ప్రధాని పేర్కొన్నారు. కాగా ఉదయం ప్రధాని మోదీ కోల్‌కతాలోని హుగ్లీనదిలో విహరించారు. కెమెరా లో సుందరదృశ్యాలను బంధించారు. పడవ నడిపే వ్యక్తి గౌరంగ్ బిస్వాస్‌తో ముచ్చటించి అతనికి రూ. 500 ఇచ్చారు. అతన్ని హత్తుకొని ధన్యవాదాలు తెలిపారు.

## డీజిల్‌కు కటకట!

మొదటి పేజీ తరువాయి

పెంపకం రైతులు కూడా డీజిల్ కోసం బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో బంకుల యజమానులతో గొడవకు దిగుతున్నారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక చాలాచోట్ల 'నో స్టాక్' బోర్డులు పెట్టి బంకులు మూసేస్తున్నారు.ఇరాన్ యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు పెరిగాయి. దీంతో ఆయిల్ కంపెనీలు డీజిల్, పెట్రోలు సరఫరాను నియంత్రించాయి. గతంలో బంకులకు క్రెడిట్‌పై పెట్రోలు, డీజిల్ సరఫరా చేసిన కంపెనీలు.. యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఆ సౌకర్యాన్ని నిలిపివేశాయి. చాలాకాలంగా పెండింగ్‌లో ఉండిపోయిన బకాయిలు చెల్లించని బంకులకు కూడా సరఫరా ఆపేశాయి. వ్యాపారాలు మూసుకోవడం ఇష్టంలేక బయట అప్పులు తెచ్చి పాత బకాయిలు చెల్లించినా కూడా ఆయిల్ కంపెనీలు డిమాండ్‌కు తగ్గట్లు ఇంధన సరఫరా చేయడం లేదు. దీనివల్ల కూడా కొరత ఏర్పడుతోందని బంకుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆయిల్ కంపెనీలతో చర్చలు జరిపి.. పాత బకాయిలు చెల్లించిన బంకులకు పూర్తిస్థాయిలో ఇంధన సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే.. రాష్ట్రంలో ఎక్కడా డీజిల్ కొరత లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారుసివిల్ సప్లయిస్ కమిషనర్ చర్చలుడీజిల్ కొరత ఏర్పడడంతో సివిల్ సప్లయిస్ కమిషనర్ కె.కన్నబాబు శుక్రవారం ఆయిల్ కంపెనీలు, పెట్రోలు బంకుల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా డీజిల్, పెట్రోలుకు కొరత లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా పెట్రోలు బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు కనిపించడానికి వీల్లేదన్నారు. అలాగే.. డీలర్లు తమ రిటైల్ అవుట్‌లెట్ల నుంచి ఇంధనాన్ని దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్నూలులో కటకట..!కర్నూలు, నంద్యాల రూరల్, భీమవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు ఆందోళన రేపుతున్నాయి. దీంతో.. వాహనదారులు సైతం అవసరం ఉన్నా, లేకపోయినా.. ఫుల్ ట్యాంక్ కోసం ఎగబడుతున్నారు. దీంతో పెట్రోల్ బంకుల వద్ద క్యూలు అమాంతం పెరిగిపోయాయి. దాదాపు అన్నిచోట్లా శుక్రవారం ఉదయం నుంచే నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రతి బంకు వద్ద ఉదయం నుంచే పడిగాపులు కాస్తున్నారు. కొందరు భయంతో ముందస్తుగా చిన్న చిన్న ట్యాంకుల్లో.. పెట్రోల్, డీజిల్ నింపుకొంటున్నారు. కర్నూలు నగరంలో పలు పెట్రోల్ బంకుల యజమానులు సిండికేట్ అయినట్లు తెలుస్తోంది. పెట్రోల్ ట్యాంక్ వచ్చీ రాగానే స్టాక్ అయిపోయిందంటూ బోర్డులు పెట్టేస్తున్నారు. లీటర్ పెట్రోల్ 110 ఉండగా దానిపై అదనంగా రూ.50 నుంచి రూ.100 దాకా బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. కాగా.. బంకుల వద్ద రద్దీ ఘర్షణలకు దారి తీస్తోంది. పాణ్యం పట్టణానికి చెందిన మధు శుక్రవారం రాత్రి తన బైక్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చాడు. ఆసమయంలో కొండజూటూరుకు చెందిన సద్దల సుజిత్ అలియాస్ బిట్టు వాహనాన్ని క్యూలో కాకుండా ముందుకు తీసుకెళ్లాడు. క్యూలో రావాలంటూ మధు ఆగ్రహం వ్యక్తం చేయగా.. 'నేనెవరో తెలుసా...? సూర్యనారాయణ రెడ్డి కొడుకుని..' అంటూ సుజిత్ దురుసగా సమాధానమిచ్చాడు. దీంతో ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో సుజిత్ తన స్నేహితులను పిలిపించి దాడిచేశాడు. ఈ ఘటనలో మధు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో డీజిల్ కోసం వాహన యజమానులు క్యాన్‌లు తీసుకుని బంకుల వద్ద క్యూ కడుతున్నారు. వీరిని అదుపు చేసేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసలే వరి కోతల సమయం కావడంతో డీజిల్ కోసం రైతులు బంకుల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు. కోత మిషన్‌దారులకు తాడేపల్లిగూడెంలో తహశీల్దార్ నుంచి తెచ్చిన లెటర్ చూపిస్తేనే డీజిల్ కొడుతున్నారు. పెద్ద వాహనాలకు రూ.1,000, ఆటోలకు రూ.500 మించి నింపడం లేదు.

## అమరావతి మెట్రోకు రూ.11 కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఉద్యోగుల వేతనాల కోసం రూ.కోటి, ప్రొఫెషనల్ ఉద్యోగుల కోసం రూ.నాలుగు కోట్లు, అద్దెలు, ట్యాక్సుల కోసం రూ.2.50 కోట్లు, వాహనాల ఖర్చుల కోసం రూ.50 లక్షలు మొత్తం రూ.11 కోట్లు విడుదల చేసింది.

## యుద్ధంలో అణ్వాయుధాలు వాడబోం

మొదటి పేజీ తరువాయి

కాల్పుల విరమణ మరో మూడు వారాలు పొడిగించారు. ఇంకో పక్క తను చేసిన నరకకూపం వ్యాఖ్యలపై ట్రంప్ యూ టర్న్ తీసుకున్నారు.భారత్ ఎంతో గొప్ప దేశమని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నట్లు ఢిల్లీలోని ఆ దేశ రాయబార కార్యాలయం పేర్కొంది. వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఇరాన్‌తో యుద్ధంలో అణ్వాయుధాలు వాడే ప్రణాళిక తనకు లేదని చెప్పారు. తాను ఎందుకు అణ్వాయుధాన్ని ఉపయోగిస్తాను? అది లేకుండానే సంప్రదాయ యుద్ధ పద్ధతుల్లో తాము వారిని ఇప్పటికే సర్వనాశనం చేశాం. తాను దాన్ని ఉపయోగించనుఅణ్వాయుధాన్ని ఉపయోగించడానికి ఎవరినీ, ఎప్పటికీ అనుమతించకూడదని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టెహ్రాన్‌తో ఒప్పందానికి తాను తొందరపడటం లేదని స్పష్టం చేశారు. తక్షణ పరిష్కారం కంటే స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందం పైనే దృష్టి సారించినట్లు తెలిపారు. ఇటీవల ముగిసిన రెండు వారాల కాల్పుల విరమణలో ఇరాన్ తన ఆయుధ వ్యవస్థలను పునరుద్ధరించుకొని ఉండవచ్చని చెప్పారుఅమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్‌కు సమయం మించిపోతోందని హెచ్చరిస్తూ ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. 'నాకు చాలా సమయం ఉంది. కానీ ఇరాన్‌కు లేదు. సమయం మించిపోతోంది. ఇరాన్ సైన్యం కుప్పకూలిపోయింది. వారి నాయకులు ఇక మనతో లేరు. దిగ్బంధనం పటిష్టంగా ఉంది. ఇకనుంచి పరిస్థితి మరిం త దారుణంగా ఉంటుంది' అని ఆయన పోస్టు చేశారుఇటీవల ఇరాన్ జెండా ఉన్న ఉన్న ఓ వాణిజ్య నౌకను అమెరికా సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఆ నౌకలో చైనా నుంచి ఇరాన్‌కు వెళ్తున్న బహుమతి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయిమరోపక్క ఇజ్రాయెల్– లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణను ఈ క్రమంలో ఇరుదేశాల నాయకులు త్వరలో వైట్ హౌస్‌లో సమావేశమయ్యే అవకాశం ఉందని కూడా తెలిపారు. ఇంకో పక్క భారత్‌ను నరక కూపంతో పోల్చి, వివాదంలో చిక్కుకున్న ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. భారత్ ఎంతో గొప్ప దేశమని, తన మిత్రుడు అక్కడ ఉన్నత స్థానంలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయ అధికార ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు.అయితే భా రత్ గొప్ప దేశమంటూ ట్రంప్ ఎక్కడ, ఎప్పు డు అన్నది మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం. భారత్, చైనా నరకకూపాలు అని ట్రంప్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో భారత్ మీడియా నుంచి ప్రశ్నలు రావడం తో రాయబార కార్యాలయం వివరణ ఇచ్చుకుంది. ఈ వివాదంపై భారత్ విదేశాంగ శా ఖ కూడా స్పందించింది. ఆ కథనాలను చూశామని, వాటిని అక్కడితో వదిలేస్తున్నామని భారత విదేశాంగశాఖ అధికార ప్రతి నిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు.

## అధిక ఆదాయమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

చర్యలు చేపట్టాలన్నారు. గతేడాది రబీలో యూరియా వినియోగం తగ్గడం శుభపరిణామమని అన్నారు. రైతు బజార్ల నుంచి డోర్ డెలివరీ చేసేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని, దీని కోసం ఏదైనా ఏజెన్సీ సేవలు వినియోగించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా చేసేందుకు క్లస్టర్ల వారీగా కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రపంచంలోనే తొలిసారిగా కోకో పంటకు సంబంధించి 'కోకో సిటీ' ఏర్పాటు చేస్తున్నామని, కోకో సిటీ ఔత్సాహిక రైతులకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా ఉండాలన్నారు. 250 ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేసేందుకు సరైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని ఆదేశించారు. అరకు ఏజెన్సీలో కుంకుమ పువ్వు సాగును మరింత విస్తరించేలా, మంచి నాణ్యమైన దిగుబడులు వచ్చేలా అధ్యయనం జరపాలన్నారు. ఏపి మష్రూమ్ మిషన్ కింద ఏడాదికి లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అనంతపురంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ఆపిల్ సాగును పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అవకాడో, అంజీర్, పనస, జామ, మిరియాల సాగును పెంచేలా దష్టి పెట్టాలని నిర్దేశించారు. అంజీర్ వంటి పండ్లను డ్రైఫ్రూట్‌గా మార్చి వాటి విలువ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మొత్తం 50 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.ఫార్మర్ యాప్ వినియోగంరాష్ట్రమంతటా క్రాప్ సర్వే చేస్తున్నామని, సాగవుతున్న పంటలు, అక్కడ జలవనరుల వివరాలు నమోదు చేస్తున్నామని అధికారులు సిఎంకు తెలియజేశారు. ఫార్మర్ యాప్‌తో రాష్ట్రంలో రైతులు, భూ విస్తీర్ణం, భూసార పరీక్షలు, యూరియా, పురుగు మందులు, విత్తనాల వినియోగం వివరాలు, ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు వంటి సమాచారం అంతా యాప్‌లో పొందుపరిచామని అధికారులు వివరించారు. ఫార్మర్ యాప్ రిజిస్ట్రేషన్లు ఇప్పటివరకు 8 లక్షల మంది రైతులు చేసుకున్నారని అధికారులు వివరించగా, రిజిస్ట్రేషన్‌తో పాటు దానిని ఎంతమంది రైతులు వినియోగించి లబ్ధి పొందుతున్నారనేది ముఖ్యమని సిఎం పేర్కొన్నారు. రైతన్నా మీకోసం ఫేజ్ 1లో 48.73 లక్షల కుటుంబాలు, ఫేజ్ 2లో 46.21 లక్షల రైతు కుటుంబాలకు పంచ సూత్రాలపై అవగాహన కల్పించనట్లు అధికారులు చెప్పారు.

ఎల్‌నినో ప్రభావం

ప్రస్తుత సీజన్‌లో నైరుతి రుతుపవనాలతో సగటు వర్షపాతం తక్కువగా, 92 శాతమే నమోదు కావొచ్చని అధికారులు అంచనాలు వివరించారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంలోని వర్షాధారిత ప్రాంతాలపై తీవ్రంగా పడే అవకాశం ఉందని, ముఖ్యంగా అనంతపురం, సత్యసాయి, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో వానలు తగ్గొచ్చన్నారు. ఇది పప్పుధాన్యాలు, నూనెగింజలు, నీటి ఆధారిత ఉద్యాన పంటలపై ప్రభావం చూపిస్తుందని వివరించారు. ఎల్‌నినో నివారణ చర్యల్లో భాగంగా ఫ్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. దీంతో ఎకరాకు రూ.5 నుంచి 7 వేల వరకు అదనపు ఆదాయం పొందుతారని చెప్పారు. ఈ ఏడాది 20 లక్షల ఎకరాల్లో దీనిని అమలు చేసేలా చూడాలని, వీబీ గ్రామ్ జి పథకానికి అనుసంధానించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ ఏడాది మొత్తం 13,300 గ్రామ పంచాయతీలకూ ప్రకతి వ్యవసాయాన్ని విస్తరించాలని, 25 లక్షల రైతులు, 11 లక్షల హెక్టార్లలో సాగు చేసేలా చూడాలన్నారు.

## తెరుచుకున్న కేదార్‌నాథ్ దేవాలయం..

వడెహ్రాడూన్, డెక్కన్ న్యూస్ : చార్‌ధా మ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు బుధవారం తెరుచుకున్నా యి. గఢ్‌వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలోని ఈ ఆలయానికి తొలి రోజే భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. ఒకానొక దశలో భక్తులను కట్టడి చేయడం ఆలయ సిబ్బందికి కష్టతరంగా మారింది. మరో వైపు స్వామి వారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు నిబంధనలు అతిక్రమిస్తూ.. ఒక క్యూ లైన్ నుంచి మరో క్యూ లైన్‌లోకి చొరబడుతున్నారు. దాంతో వారి మధ్య ఘర్షణ, వాగ్వివాదం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారుఆరు నెలల తర్వాత.. ఏప్రిల్ 22వ తేదీన ఈ కేదార్‌నాథ్ దేవాలయం తెరుచుకుంది. మరో ఆరు నెలల పాటు ఈ దేవాలయం తెరిచి ఉంచుతారు. ఈ ఏడాది నవంబర్ 11వ తేదీన ఈ దేవాలయాన్ని మూసివేస్తారు. శీతాకాలం ఈ ప్రాంతంలో భారీగా చలిగాలులు వీస్తాయి. ఈ నేపథ్యంలో ఆరు నెలల పాటు ఈ దేవాలయాన్ని మూసివేయ నున్నారు.ఉత్తరా ఖండ్‌లోని హిమాలయ పర్వతాల్లో ఏప్రిల్ 19వ తేదీన చార్‌ధామ్ యాత్ర ప్రారంభ మైంది. అక్షయ తృతీయ సందర్భంగా ఉత్తర కాశీ జిల్లాలోని గంగోత్రి, యమునోత్రి ఆలయాలను తెరిచారు. ఏప్రిల్ 22న రుద్రప్రయాగ్‌లోని కేదార్‌నాథ్, ఏప్రిల్ 23వ తేదీన చమోలీలోని బద్రీనాథ్ ఆలయాలను తెరిచారు. ఈ చార్‌ధామ్ యాత్ర కోసం వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

## నేల బాగుంటే ... మనం బాగుంటాం..




లావేరు : లావేరు మండలంలోని లింగాలవలస గ్రామంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం భూసార పరీక్షలు నిర్వహించారు. దానివల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. నేల పరీక్షలు చేయడం వలన పంటలకు తగిన మోతాదులో ఎరువులు వాడడం వలన పెట్టుబడి తగ్గించి అధిక దిగుబడలు సాధించవచ్చు అని తెలియచేశారు. అదేవిదంగా రాబోయే ఖరీఫ్ సీజన్లో పొడి పద్ధతిలో వరి సాగు చేయడం వలన నీటి తడులు తగ్గించడం, కూలీలు కొరతను అధిగమించడం వలన రైతులకి పెట్టుబడి ఖర్చు తగ్గి అధిక దిగుబడలు సాధించి వాతావరణంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో సైతం రైతులు పంటలు పండించవచ్చు అని తెలియచేశారు. డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా జరిగే అగ్రోఫారేస్ట్రీ, డ్రం సీడర్, సీడ్రిల్ మొదలైన పద్ధతుల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ టీం లీడర్ సూర్యనారాయణ, సమన్వయ కర్తలు యస్.సాయిదుర్గ, ఐ. అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

## కొత్త జాతీయ రహదారి వివరాలు సమర్పించండి

మొదటి పేజీ తరువాయి

నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా కొత్త జాతీయ రహదారి నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎన్‌హెచ్ఎఐ అధికారులు విజయవాడలో భూ యజమానులతో భాగ స్వాముల సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలు తీసుకున్నారు. ఇప్పటికే మూడు సార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామని, ఇంకా ఎన్నిసార్లు భూములు ఇవ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోవైపు కేంద్రం డిపిఆర్ కూడా సిద్ధం చేసింది. ప్రజా ప్రతినిధులు కూడా తొలుత కొత్తరోడ్డు వద్దని వాదించి తరువాత వేయాల్సిందేనని ప్రకటించారు. ఈ నేపథ్యంలో 71 మంది రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిగింది. రైతుల తరపున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దయెత్తున ముంపునకు గురైందని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని తెలిపారు. దీనిపై ఎంతమందిని తరలించాల్సి వచ్చిందో అప్పట్లో సేవలందించిన ఎన్‌డిఆర్ఎఫ్ నుండి కూడా సమాచారం తెప్పించుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే డిపిఆర్ కూడా సిద్ధం చేశారని కోర్టుకు తెలిపారు. డిపిఆర్ విడుదల చేశారా? సిద్ధమైందని మీకు ఎలా తెలుసని న్యాయమూర్తి ప్రశ్నించగా భాగస్వామ్య సమావేశంలో ప్రదర్శించారని, రైతులకు సమాచారం ఇచ్చారని న్యాయవాది తెలిపారు. కొత్తగా రోడ్డును కృష్ణానది బఫర్‌జోన్లో నుండి వేస్తున్నారని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణ భాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని పేర్కొన్నారు. దీంతో ఆయా విభాగాల నుండి కౌన్సిళ్లు ఎవరు హాజరయ్యారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న రెవెన్యూ, జలవనరులు, జాతీయ రహదారుల విభాగ కౌన్సిళ్లు న్యాయమూర్తి ముందు హాజరయ్యారు. వెంటనే రోడ్డుకు సంబంధించిన వివరాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించి మూడువారాల పాటు విచారణను వాయిదా వేశారు.

## ఆప్‌కు షాక్

మొదటి పేజీ తరువాయి

మాత్రమే మిగిలారు. పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ మాట్లాడుతూ.. బీజేపీ పంజాబ్‌కు ద్రోహం చేసిం దని, శరద్ పవార్, శివసేన (యూబీటీ), కాంగ్రెస్ విషయంలో కూడా ఇదే విధానాన్ని అవలంభించారని విమర్శించారు. పంజాబ్‌లో బీజేపీకి ఎలాంటి పట్టులేకపోవడంతో ఇలాంటి దుశ్చర్యలకు దిగుతుందని మండిపడ్డారు. ఇక బీజేపీలో చేరుతున్న ఆ ఏడుగురు ఎంపీలు పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించరని, వారు ద్రోహులని ఆగ్రహం వ్యక్తంచేశారుఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌ను ఎదుర్కోలేక బీజేపీ ఆపరేషన్ లోటస్‌ను ప్రారంభించిందని ఆరోపించారు. పంజాబ్‌కు మంచిచేస్తుంటే బీజేపీ అడ్డుకోవడానికి చూస్తుందని విమర్శించారుప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ప్రజలు పంజాబ్ ప్రజలు ఎప్పటికీ క్షమించరని, పరిపాలనా యంత్రాంగ్రాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రజలు ఈ విషయాన్ని, ఏడుగురు ఎంపీలను దృష్టిలో పెట్టుకొని భవిష్యత్‌లో వారికి బుద్ధి చెప్పాలన్నారు. ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ సోషల్ వేదికగా స్పందించారు. పంజాబ్‌కు బీజేపీ మరోమారు ద్రోహం చేసిందన్నారు.

## సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

న్యూఢిల్లీ బ్యూరో : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష పార్టీలు కొత్త నోటీసును సమర్పించాయి. శుక్రవారం 11 ప్రతిపక్ష పార్టీలకు చెందిన 73 మంది ఎంపిల సంతకాలతో కూడిన నోటీస్‌ను రాజ్యసభ సెక్రటరీ జనరల్ పిసి మోడీకి అందజేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 (5)తోపాటు ఆర్టికల్ 124 (4), ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టం–2023లోని సెక్షన్ 11(2), న్యాయమూర్తుల (విచారణ) చట్టం–1968ల కింద దుష్ప్రవర్తన కారణంగా, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ రాష్ట్రపతికి ఉద్దేశించిన లేఖను రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు అందజేశారు. 'ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ఇప్పుడు తొమ్మిది నిర్దిష్ట ఆరోపణలు ఉన్నాయి. అవి చాలా వివరంగా నమోదు చేయబడ్డాయి. వాటిని ఏ విధంగానూ ఖండించడం లేదా కప్పిపుచ్చడం సాధ్యం కాదు. ఆయన పదవిలో కొనసాగడం రాజ్యాంగంపై దాడి చేయడమే. ప్రధాన మంత్రి, హోంమంత్రి చెప్పినట్లు చేయడానికి ఆ వ్యక్తి ఇంకా పదవిలో కొనసాగడం పూర్తిగా అవమానకరం' అని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. 'మేము ఈరోజు మధ్యాహ్నం 73 మంది సంతకాలతో నోటీసు సమర్పించాం. సిఇసిని తొలగించ డానికి కొత్త కారణాల ను పేర్కొన్నాం. నిర్దిష్ట సంఘటనలను తెలి యజేశాం' అని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ స్పష్టం చేశారు. జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం కోసం ప్రవేశపెట్టిన నోటీసును లోక్‌సభ స్పీకరు ఓం బిర్లా, రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ తిరస్కరించిన కొన్ని వారాల తరువాత ఇప్పుడు రెండో నోటీస్ అందజేశారు. జ్ఞానేష్ కుమార్‌పై తొలిసారి ఇచ్చిన అభిశంసన నోటీసులను పార్లమెంటు తిరస్కరించడం పార్లమెంటును అపహాస్యం చేయడమేనని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఒక అభిశంసన తీర్మానం ఆమోదం పొందాలంటే, లోక్‌సభలో కనీసం 100 మంది ఎంపిలు, రాజ్యసభలో 50 మంది ఎంపిలు దానిపై సంతకం చేయాలి.

## సిఎం సభకు సమాచారం సేకరణ



నందిగాం: నందిగాం మండలంలో మొండ్రాయివలస సుభద్రాపురం గ్రామపంచాయతీలో మే 12న జరగబోవు ముఖ్య మంత్రి సభకు సచివాలయ సిబ్బంది సమాచారాన్ని సేకరించాలని ఎంపీడీవో మండల గ్రామస్థాయి సిబ్బందిని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి వాళ్ళ అవసరాలను గుర్తించి సమస్యలు ఉంటే ముందుగా పరిష్కారం చేయాలని జడ్పీ సీఈవో వెంకటరమణ ద్వారా పీడీ, కిరణ్ కుమార్, ఎంపీడీవో కుమార్ పట్నాయక్, వెలుగు ఏపీఎం మణిరత్నం కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పిడిఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మదర్ ఫీడింగ్ రూమ్, మొబైల్ ఛార్జింగ్ కేంద్రం ప్రారంభం



ప్రజాస్వామ్యం / విజయనగరం: సర్వజనులకు ఉపయోగపడే విధంగా పోస్టల్ సేవలను మరింత సులభతరంగా, సౌకర్యవంతంగా చేయాలనే లక్ష్యంతో మదర్ ఫీడింగ్ రూమ్ మరియు మొబైల్ ఛార్జింగ్ స్టేషన్ ను ప్రారంభించినట్లు విశాఖపట్నం పోస్ట్ మాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్ అన్నారు. శుక్రవారం విజయనగరం హెడ్ పోస్ట్ ఆఫీసును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు,ముఖ్యంగా చిన్నారులతో పోస్ట్ ఆఫీసుకు వచ్చే తల్లులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు మదర్ ఫీడింగ్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వినియోగదారుల అవసరాలను గుర్తించి ఫోన్లను ఛార్జింగ్ చేసుకునేందుకు మొబైల్ ఛార్జింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినట్లు జయశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు,సహాయ సూపరింటెండెంట్ లు జి.వి.రమణారావు, పి.సుందర్ నాయుడు, గజపతినగరం పోస్టల్ ఇన్స్పెక్టర్, బొద్దల ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల

# పరిష్కార వేదికలో గంటా



విశాఖపట్నం, ప్రజాస్వామ్యం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై నియోజకవర్గం ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. మౌలిక సమస్యలు పరిష్కరించాలని పలువురు ఆయన్ను కోరారు. పీఎం పాలెంలో వైసీపీ నాయకుడొకరు తమ భూమి ఆక్రమించి బెదిరిస్తున్నారని ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఫ్లాట్ విక్రయిస్తానని అడ్వాన్స్ తీసుకుని కానిస్టేబుల్ మోసం ఒక కుటుంబం ఎమ్మెల్యేకు మొర పెట్టుకుంది. ఈ రెండు విషయాలను సీరియస్ గా తీసుకుని పరిష్కరించాలని పోలీస్ అధికారులకు చెప్పారు. కొండవాలు ప్రాంతంలో తల దాచుకోవడానికి 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న రేకుల షెడ్లు శిథిలమైపోయాయని.. మరమ్మత్తులకు సింహాచలం దేవస్థానం అనుమతి ఇవ్వని కారణంగా కూలిపోయే స్థితికి చేరుకున్నాయని వరాహగిరి కాలనీ వాసులు గంటా దృష్టికి తీసుకువచ్చారు. భీమిలి నియోజకవర్గంలో అనేక కంపెనీలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని ఇద్దరు యువకులు కోరారు. పరిష్కార వేదికలో చేసిన ఫిర్యాదులకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపించాలని సిబ్బందికి సూచించారు.

# స్వీయ గణన పై అవగాహనకు 26న 5- కె రన్

## జిల్లా కలెక్టర్ - ఎస్ రాంసుందర్ రెడ్డి



ప్రజాస్వామ్యం / విజయనగరం: భారత జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా స్వీయ గణన పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విజయనగరం పట్టణం లో ఈ నెల 26వ తేదీ ఉదయం 6.00 గంటలకు "సెన్సస్ 5కే రన్" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారుఈ 5కే రన్ పైడితల్లి అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమై, గాంధీ విగ్రహం (ఎస్‌బీఐ సమీపంలో), ఆర్‌టీసీ కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మార్గంగా కోట జంక్షన్ వద్ద ముగుస్తుంజనగణన--2027 స్వీయ గణన కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం కల్పించడం, ప్రతి వర్గానికీ ఈ కార్యక్రమాన్ని చేరువ చేయడం లక్ష్యంగా ఈ 5కె రన్ నిర్వహించబడుతోందని కలెక్టర్ వివరించారుఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పలు శాఖలకు బాధ్యతలు కేటాయించడం జరిగిందన్నారుపోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు చేపడుతుందని, మున్సిపల్ శాఖ మార్గం పరిశుభ్రత, త్రాగునీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తుందని, మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారవిద్యాశాఖ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారుడీఎస్డీఓ కార్యాలయం సమన్వయం బాధ్యతలు నిర్వహిస్తుందని, తహసీల్దార్ అన్ని శాఖల సమన్వయం పర్యవేక్షించాలని ఆదేశించారు క్రీడాకారులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువజన సంఘాలు మరియు ప్రజలు భారీగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## గీతం పరిశోధకుడికి

# "ప్రధానమంత్రి ఫెలోషిప్"



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్‌కు చెందిన యువ పరిశోధకుడు కొండ వెంకట సాయి తన వినూత్న కార్డియాక్ బయోసెన్సర్ ప్రాజెక్టుకు గాను కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రధాన మంత్రి ఫెలోషిప్ ఫర్ డాక్టోరల్ రీసెర్చ్‌కు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా కేవలం 51 మంది పరిశోధకులకు మాత్రమే ఈ అరుదైన ఫెలోషిప్ దక్కడం అందులో గీతం పరిశోధకుడు ఒకరు కావడం విశేషం. గుండెపోటు ముప్పును ముందే పసిగట్టి విలువైన ప్రాణాలను కాపాడే దిశగా గీతం స్కాలర్ కొండ వెంకట సాయి స్కూల్ ఆఫ్ సైన్స్‌కు చెందిన డాక్టర్ రాహుల్ కుమార్ పర్యవేక్షణలో "మయోట్రాక" అనే అత్యాధునిక పోర్టబుల్ పరికరాన్ని అభివృద్ధి చేయనున్నారు. మయోట్రాక్ పరికరం పరిమాణంలో చిన్నది మరియు పోర్టబుల్ కావడంతో దీనిని అంబులెన్స్‌లలోను, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు మరియు ప్రాథమిక చికిత్సాలయాల్లో సులభంగా వాడే విధంగా పరికరం రూపొందిస్తున్నట్లు వెంకట సాయి తెలిపారు. ఖరీదైన ల్యాబ్ సౌకర్యాలు లేని చోట కూడా అతి తక్కువ ఖర్చుతో గుండె పోటును ప్రాథమిక దశలోనే గుర్తించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ప్రాణాలను కాపాడే ఈ బృహత్తర కార్యం ద్వారా భారతీయ ఆరోగ్య రంగంలో సరికొత్త అధ్యాయం మొదలవ్వబోతోందని ఆయన తెలిపారు. తన పరిశోధనకు ప్రోత్సాహకరంగా ప్రధాన మంత్రి ఫెలోషిప్ లభించడం కొత్త ఉత్సాహాన్ని అందించిందని ఆయన పేర్కొన్నారు.

## అవంతి కళాశాలలో ఈఏపి సెట్

# నమూనా పరీక్ష నిర్వహణ



తగరపువలస, ప్రజాస్వామ్యం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యను చదువుకొనే విద్యార్థుల కోసము ఈఏపి సెట్ నమూనా పరిక్షను శుక్రవారం నిర్వహించినారు. ఈ పరీక్షకు వివిధ ప్రాంతాల నుంచి 225 మంది విద్యార్థులు హాజరైనారు. ఈ పరీక్షను అవంతి కళాశాల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) ఆదేశాలు మేరకు ప్రిన్సిపాల్ డా.బి. మురలీకృష్ణ, డైరెక్టర్ డా. ఏ. చంద్రశేఖర్, డా.యు. రాము మరియు పి. సత్యనారాయణ పర్యవేక్షించారు.

# నేర నియంత్రణలో భాగంగా సిసి కెమెరాల ఏర్పాటు

## సీ.ఐ - జి.ఏ.వి.రమణ ఎస్.ఐ - యు.మహేష్



ప్రజాస్వామ్యం/బొండపల్లి, (గజపతినగరం) :మండలంలోని గొట్లాం బైపాస్ జంక్షన్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై యు.మహేష్ విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐయు.మహేష్ మాట్లాడుతూ గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఏ వి రమణ ఆధ్వర్యంలో గొట్లం బైపాస్ జంక్షన్లో నాలుగు(4హై - రిజల్యూషన్ నైట్ విజన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. బైపాస్ రోడ్డు నాలుగు రోడ్ల కూడలి ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చేసి వాహనాలు ఆపకుండా తప్పించుకొని వెళ్లిపోయిన వాళ్లను గుర్తించడానికి( హిట్ అండ్ రన్) సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్. ఐ యు.మహేష్ అన్నారు. అదేవిధంగా నేరం చేసి , మరియు చేయడానికి వచ్చిన వారిని గుర్తించడానికి ఉపయోగపడే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినటు ఎస్సై యు మహేష్ విలేకరులకు తెలియజేశారు. ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను నియంత్రించడానికి అవకాశం కలుగుతుందని ఎస్. యు.మహేష్ అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## అధికారాన్ని హోదాగా

# కాకుండా...'బాధ్యత' గా భావించాలి

### బి. వి. రాం సూచన



విశాఖపట్నం, ప్రజాస్వామ్యం అధికారం అనేది ఎప్పుడూ శాశ్వతం కాదు. ఏ చరిత్రను గమనించినా లేదా ప్రస్తుత సమాజాన్ని పరిశీలించినా, ఈ విషయం స్పష్టమవుతుంది శుక్రవారం ఉదయం తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ కూటమి ప్రజా ప్రతినిధులకు మరియు కూటమి నాయకులకు సూచన చేశారు. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఈరోజు అధికారంలో ఉన్నవారు రేపు సామాన్యులుగా మారవచ్చని ఆన్నారు. ప్రకృతి నియమం ప్రకారం ఏదీ శాశ్వతం కాదు, ముఖ్యంగా పదవులు మరియు హోదాలు. అందుకే అధికారంలో ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికారాన్ని ఒక 'హోదా'గా కాకుండా, ప్రజలకు సేవ చేసే ఒక 'బాధ్యత'గా భావించినప్పుడే దానికి సార్ధకత లభిస్తుందని ఆన్నారు. పదవిలో ఉన్నప్పుడు చేసే మంచి పనులే ఆ వ్యక్తికి శాశ్వతమైన కీర్తిని అందిస్తాయి. ఇది గుర్తుపెట్టుకోండి ముందుకు సాగితే మం చిది. అధికారం చేతిలో ఉన్నప్పుడు అహంకారం తలకెక్కకుండా, వినయంతో ప్రవర్తించడం గొప్ప నాయకుడి లక్షణమని ఆన్నారు. అవినీతికి తావు లేకుండా, పారదర్శకమైన పాలన అందించే వారే ప్రజల హృదయాల్లో నిలిచిపోతారు. ముఖ్యంగా నేటి యువత రాజకీయాల్లోకి లేదా పరిపాలనలోకి వచ్చినప్పుడు, అధికారం అనేది ఒక అవకాశం మాత్రమేనని, అది ప్రజల కోసం వినియోగించి, అవినీతికి తావులేని, సేవ చేయడానికి వచ్చిన అవకాశంగా గుర్తించాలిని, కూటమి నాయకులను ఉద్దేశించి తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు.

## మెరిట్ విద్యార్థులకు సాయి సంహిత

# ఫౌండేషన్ ఆర్థిక ప్రోత్సాహకాలు



తగరపువలస, ప్రజాస్వామ్యం మెరిట్ విద్యార్థులకు సాయి సంహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పలరాజు రూ. 10 వేలు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జి వి యం సి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ప్రస్తుతం పదవ తరగతిలోకి విచ్చేసిన కొప్పల తేజేశ్వరి, హరినేశ్వరి, మహేశ్వరి, భూ మిత్ర, వరుణ్ సందేశ్, భార్గవి, వికాస్, గగన సరస్వతి, అదేవిధంగా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల బంగ్లామెట్ట విద్యార్థులు సహస్ర, వైష్ణవి, హర్షిత, అప్రోచ్, వెంకటేష్ మరియు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల వల్లందపేట విద్యార్థులకు అందరికి కలిపి పదివేల రూపాయలు చదువులో రాణిస్తున్నందుకు అందించారు. అవసరమైతే వారి ఉన్నత చదువులకు ఐదు లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వై. జగన్నాథ స్వామి, కోరాడ రామారావు, వై. సంతోషి కుమారి ఉపాధ్యాయులు ఎస్.జగదీష్, ఎన్. శ్రీదేవి, కే వెంకటలక్ష్మి, సుంకర నందిని, వై వెంకటేష్, ఎస్ .రాజేశ్వరి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అప్పన్న భూములను గూగుల్‌కు ఇవ్వడం తగదు

## వైసిపి జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి



తగరపువలస, ప్రజాస్వామ్యం సింహాచలం శ్రీ వరహా లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూములను గూగుల్ సంస్థకు లీజుకు ఇవ్వడాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. దేవాలయ భూములను కేవలం ధార్మిక అవసరాలకే వినియోగించాలని, పరిశ్రమల కోసం కేటాయించడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ చర్య భక్తుల మనోభావాలను దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన బింగి హరికిరణ్ రెడ్డి గూగుల్ వంటి సంస్థలకు విశాఖలో వేరే ప్రాంతాల్లో భూములు కేటాయించవచ్చని సూచించారు. కానీ దేవస్థానం భూములనే లక్ష్యంగా పెట్టుకోవడం అన్యాయమని అన్నారు. పంచాగ్రామాల ప్రజలు దశాబ్దాలుగా భూముల కోసం పోరాటం చేస్తున్న నేపథ్యంలో, రెగ్యులరైజేషన్ కోరుతున్న కుటుంబాలకు ఇది మరింత అన్యాయం అవుతుందని పేర్కొన్నారు. గతంలో కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింహాచలం బస్సు డిపో, విశాఖ సెంట్రల్ జైల్ కోసం దేవస్థానం భూములు తీసుకుని ప్రత్యామ్నాయ భూములు ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. సింహగిరి ప్రాంతంలోని భూములు ముడసర్ల వాగు రిజర్వాయర్‌కు సమీపంలో ఉన్నాయని, అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది విశాఖ నగరానికి తాగునీటి సరఫరాపై కూడా ప్రభావం చూపవచ్చని తెలిపారు.కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై పవన్ కళ్యాణ్ స్పందించాలని, సనాతన ధర్మం గురించి మాట్లాడే ఆయన ఈ అంశంపై తన అభిప్రాయం వెల్లడించాలని కోరారు. భూముల కేటాయింపుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.



# గ్లామర్ డోస్ పెంచేసిన కృతి సనన్.. బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత హీట్ పెంచుతూ!

అసలే సమ్మర్.. సూర్య భగవానుడి భగభగ మంటలకు ప్రజలు అల్లాడిపోతుంటే .. హీరోయిన్లు కూడా ఆ వేడిని మరింత పెంచడానికి సెగలు పుట్టించేలా ఔట్ ఫిట్స్ ధరిస్తూ సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఒకరి తర్వాత ఒకరు.. ఒకరితో ఒకరు పోటీపడుతూ గ్లామర్ విందు వడ్డిస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు . ఇక సోషల్ మీడియా వాడకం ఎప్పుడైతే పెరిగిపోయిందో అటు చిన్న పిల్లల్ని మొదలుకొని పెద్దవాళ్ల వరకు ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్ లేనిదే గడవని రోజులు . అలాంటి ఈ సమయంలో హీరోయిన్స్ కూడా తమ అందాలను ఎరగా వేసి క్యాష్ చేసుకుంటున్నారు అనే వార్తలు ఎప్పటికప్పుడు వ్యక్తం అవుతూనే ఉన్నాయిఈ క్రమంలోనే అలా అందాలతో మరింత హీట్ పెంచుతూ బ్లాక్ అవుట్ ఫిట్ లో సెగలు పుట్టించే ప్రయత్నం చేసింది కృతి సనన్. విభిన్నమైన ఫోజులు ఇస్తూ సెగలు పుట్టించేలా ఫోటోలకు పంచుకుంది. బ్లాక్ అవుట్ ఫిట్ లో కృతి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. లెదర్ మెటీరియల్ ను తలపించేలా బ్లాక్ డ్రెస్ ధరించిన ఈమె తన అవుట్ ఫిట్ ను మరింత అందంగా మార్చుకుంది. హుందాగా ఫోటోలకు ఫోజులిస్తూ మెస్మరైజ్ చేసింది. మరికొన్ని ఫోటోలలో రొమాంటిక్ గా ఫోజులిస్తూ నెటిజన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అలా మొత్తానికైతే కృతి తాజాగా షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుందిఇండస్ట్రీలోకి రాకముందు పెద్ద పెద్ద కంపెనీల కమర్షియల్ యాడ్స్ లలో నటించిన ఈమె.. తొలిసారి తెలుగులో మహేష్ బాబు హీరోగా వచ్చిన 1: నేనొక్కడినే అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఇక ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులను తన అందం , హైట్ తో అందర్నీ ఆకట్టుకున్న కృతి సనన్.. హిందీలో జాకీ ష్రాఫ్ వారసుడు టైగర్ ష్రాఫ్ తో హీరోపంతి సినిమాలో నటించి హిందీ రంగ ప్రవేశం చేసిం.ది ఇక తర్వాత ఆది పురుష్ సినిమాలో సీత పాత్ర పోషించి.. ఇటు తెలుగు ప్రేక్షకులను మరోసారి పలకరించింది కృతి సనన్.హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె తాజాగా కాక్ టెయిల్ 2 సినిమాలో నటిస్తోంది. రష్మిక మందన్నతో కలిసి నటిస్తోంది. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తుంది ఈ చిన్నది.. మరి ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.



### థియేటర్లు పగిలిపోయే


# సీన్ తో రావణాసురిడి ఎంట్రీ!

దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తోన్న -రామాయణ-పై రోజురోజుకూ అంచనాలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీత పాత్రల ఆహార్యంలో ఒదిగిపోవడంతో సినిమా సంపూర్ణ చిత్రంగా హైలైట్ అవుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రానికి సంబంధించి ఓ క్రేజీ అప్డేట్ వెలువడింది. ఈ చిత్రం ఏ సన్నివేశంతో ప్రారంభమవుతుందనే దానిపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. సాధారణంగా రామాయణం అంటే రాముడి జననం లేదా బాల్యంతో మొదలవుతుందని అంతా ఊహిస్తారు. కానీ ఈ సినిమా మాత్రం రావణాసురుడి పరాక్రమంతో ప్రారంభం కాబోతోందని తెలుస్తోంది.సినిమా ప్రారంభ సన్నివేశం రావణాసురుడు (యష్) సవతి సోదరుడైన కుబేరుడిపై యుద్ధం ప్రకటించే ఘట్టంతో మొదలవుతుందని సమాచారం. లంకను కైవసం చేసుకోవడమే కాకుండా తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి రావణుడు కైలాస పర్వతం సమీపంలోని అలకాపురి వరకు కుబేరుడిని ఎలా వెంటాడాడు? అనే అంశాన్ని అత్యంత భారీ స్థాయిలో చిత్రీకరించినట్లు సమాచారం. ఈ యుద్ధ సన్నివేశం సినిమా స్థాయిని తొలి నిమిషం నుండే ప్రేక్షకులకు పరిచయం చేస్తుందంటున్నారు . రావణాసురుడు విలన్ మాత్రమే కాదు.గొప్ప పండితుడు, వీరుడు శివభక్తుడు కూడా. అతని పాత్రలోని ఆ విభిన్న కోణాలను ఆవిష్కరించేందుకే సినిమాను రావణుడి కోణంలో ప్రారంభిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కుబేరుడిని ఓడించి పుష్పక విమానాన్ని చేజిక్కించుకోవడం ద్వారా రావణుడు తన అజేయమైన శక్తిని ఎలా చాటుకున్నాడో ఓపెనింగ్ సీన్ ద్వారా చూపించబోతున్నారుట. ఇది సినిమాపై ఆసక్తిని అంతకంతకు పెంచుతుంది. మరో కీలకమైన విషయం ఏమిటంటే? మొదటి భాగంలో రాముడు , రావణుడు ఎదురెదురు పడే సన్నివేశాలు ఉండవట.ప్రాజ్యం వేరుగా సాగుతాయి. పరిస్థితులు వారిని రెండో భాగంలో ఎలా కలిపాయి అనేదే అసలు కథ- అని పేర్కొన్నారు. దీంతో రాముడు - రావణుడు మధ్య జరిగే అసలైన యుద్ధం కోసం అభిమానులు రెండో భాగం వరకు వేచి చూడాల్సిందే. ప్రపంచ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్ కోసం ఆస్కార్ విన్నర్ డిఎన్ఇజి సంస్థ పనిచేస్తోంది. ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందుతోన్న తొలి భారతీయ చిత్రాలలో ఇదీ ఒకటి కావడం విశేషం. ఏఆర్ రెహమాన్ - హాన్స్ జిమ్మర్ వంటి మేధావులు సంగీతాన్ని అందించడం మరో విశేషంనితేష్ తివారీ రామాయణాన్ని ఓ కథగా కాకుండా అనుభవంగా మలిచేందుకు ప్రయత్నిస్తున్నారు అన్నది కాదనలేని నిజం. రావణ - కుబేర యుద్ధంతో మొదలయ్యే ఈ ప్రయాణం రాముడి పట్టాభిషేకం లేదా వనవాసం వరకు మొదటి భాగంలో ఎలా సాగుతుందో చూడాలి. 2026 దీపావళి కానుకగా ఈ చిత్రం విడుదల కానుంది. భారతీయ సినిమా చరిత్రలో ఇదో గేమ్ ఛేంజర్ అవుతుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# దేవర 2: అసలు ఎందుకు రావట్లేదంటే..

సోషల్ మీడియాలో రెండు రోజులుగా 'దేవర 2 షెల్వ్' అనే మాట గట్టిగా వినిపిస్తోంది. చీ=కి ఇంట్రెస్ట్ లేదు, కొరటాల బాలకృష్ణతో సినిమాకి వెళ్తున్నాడు అంటూ టాక్. అయితే ఇది అఫీషియల్ న్యూస్ కాదు. కేవలం ఇండస్ట్రీ సర్కిల్స్‌లో జరుగుతున్న చర్చ మాత్రమే. మరి ఈ టాక్ వెనక ఉన్న లాజిక్ ఏంటి అనే వివరాల్లోకి వెళితే..పార్ట్ 1 రిలీజ్ తర్వాత ట్రేడ్ వర్గాల్లో ఒక టాక్ నడిచింది. చీ= పెర్ఫార్మెన్స్, అనిరుద్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయాయి. కానీ సినిమా స్క్రీన్ ప్లే కొరటాల రొటీన్ మేకింగ్ పైన అంచనాలకు తగ్గట్టు జరగలేదని ఓ వర్గం నుంచి వచ్చిన టాక్. సాధారణంగా పార్ట్ 1 బ్లాక్‌బస్టర్ అయితేనే పార్ట్ 2 మీద బయ్యర్స్ కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ఇక్కడ లెక్క కాస్త తేడా కొట్టినట్టు కనిపించింది. దీంతో సీక్వెల్ విషయంలో నిర్మాతలు ఆచితూచి అడుగు వేయాల్సిన పరిస్థితి.రెండో పాయింట్.. హీరో, డైరెక్టర్ కమిట్‌మెంట్స్. చీ= చేతిలో ప్రస్తుతం ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ ఉంది. అది పాన్ వరల్డ్ లెవెల్‌లో ప్లాన్ చేస్తున్న సినిమా. దానికి కనీసం ఏడాదిన్నర డేట్స్ కావాలి. అది కాకుండా 'వార్ 2' తర్వాత హిందీ మార్కెట్ నుంచి కూడా మంచి ఆఫర్స్ వస్తున్నట్టు సమాచారం. ఇటు కొరటాల శివ కూడా బాలకృష్ణతో సినిమాకి స్క్రిప్ట్ లాక్ చేశాడనే న్యూస్ బలంగా ఉంది. ఇద్దరూ వేరే కమిట్‌మెంట్స్‌లో ఉంటే దేవర 2 వెంటనే మొదలవడం కష్టమే.మూడో అంశం బడ్జెట్ రిస్క్. పార్ట్ 1కి 300 కోట్ల దాకా ఖర్చు చేశారని టాక్ వచ్చింది. పార్ట్ 2 అంటే స్కేల్, ఎఖీశ డబుల్ అవుతుంది. 400-450 కోట్ల బడ్జెట్ అవసరం అయ్యే ఛాన్స్ ఉందట. ఫస్ట్ పార్ట్ ఇచ్చిన రిస్కీ రిజల్ట్ చూశాక, ఇప్పుడున్న మార్కెట్‌లో ఆ రేంజ్ రిస్క్ తీసుకోవాలంటే మేకర్స్ వెనకాడరని అనిపిస్తుంది. అంతేకాదు, చీ= ప్రస్తుతంహిందీ రైట్స్ రూపంలో సేఫ్ రిటర్న్లు వస్తాయనే ఆలోచన ఉండొచ్చు.ఫైనల్‌గా చెప్పాలంటే షెల్వ్ అయింది అని ఫిక్స్ అవ్వడానికి లేదు. కానీ 2026లో కానీ, 2027 ఫస్ట్ హాఫ్‌లో కానీ దేవర 2 సెట్స్ మీదకు వెళ్లే అవకాశాలు చాలా తక్కువ. చీ=, కొరటాల ఇద్దరి కాల్షీట్స్ క్లియర్ అయ్యి, మార్కెట్ లెక్క సెట్ అయ్యేంత వరకు ఈ ప్రాజెక్ట్ వెయిటింగ్ లిస్ట్‌లోనే ఉంటుంది. ఇది క్యాన్సిలేషన్ కాదు, కమర్షియల్ బ్రేక్ అనుకోవచ్చు.





# 100 కోట్లకు దగ్గరగా త్రిష ప్లానింగ్

గత కొంతకాలంగా సీనియర్ హీరోయిన్స్ కు డిమాండ్ పెరుగుతోంది. ఐదేళ్ల క్రితం వరకు 30 దాటితే సపోర్టింగ్ రోల్స్ తో సర్దుకునే వారు. కానీ ప్రస్తుతం సీనియర్ భామలు 40కి దగ్గరవుతున్నా క్యారెక్టర్ కు తగ్గట్టుగా హీరోలకు జోడిగా కొనసాగుతున్నారు. ఆ లిస్టులో నయన్, త్రిష క్రేజే వేరు. ముఖ్యంగా ఇప్పుడు త్రిషకు ఉన్న డిమాండ్ మామూలుగా లేదు. హీరోయిన్‌గా రెండు దశాబ్దాలు దాటినా రెమ్యునరేషన్ తగ్గలేదు, డిమాండ్ ఆగలేదు. పైగా ఏజ్ పెరిగే కొద్దీ బ్యాంక్ బ్యాంక్ బ్యాలెన్స్ పెరుగుతోంది.లేటెస్ట్ గా త్రిష కృష్ణన్ నెట్ వర్త్ 85 కోట్లు దాటిందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇంకో రెండు సినిమాలు హిట్ అయితే 100 కోట్ల క్లబ్‌లోకి వెళ్లిపోతుందని తెలుస్తోంది. మరి ఈ 'సైలెంట్ సక్సెస్' వెనక అసలు ఫార్ములా ఏంటి అనే వివరాల్లోకి వెళితే.. 1999లో 'జోడి'తో ఎంట్రీ ఇచ్చినప్పుడు ఎవరూ ఊహించి ఉండరు, ఈ అమ్మాయి 2026లో కూడా కోట్లు తీసుకుంటూ లీడ్ రోల్స్ చేస్తుందని. వర్షం, ఘిల్లితో స్టార్ హీరోయిన్ గా మంచి క్రేజ్ అందుకుంది.మధ్య మధ్యలో అలా సక్సెస్ చూసిన అమ్మడు హీరోయిన్ గా ఇక కష్టమే అనుకుంటున్న సమయంలో 96తో క్లాస్ ఆడియన్స్‌ని పట్టేసింది. కెరీర్‌లో గ్యాప్ వచ్చిన ప్రతిసారీ 'విన్నైతాండి వరువాయా', 'పొన్నియిన్ సెల్వన్' లాంటి సినిమాతో బౌన్స్ బ్యాక్ అయింది. అంటే ప్రతి ఐదేళ్లకు ఒకసారి తన మార్కెట్‌ని తనే రీసెట్ చేసుకుంటూ వచ్చింది. అందుకే 25 ఏళ్ల తర్వాత కూడా రేసులో ఉంది. ఇప్పుడు త్రిష ఒక్కో ప్రాజెక్ట్‌కి 10 కోట్ల రేంజ్ లో రెమ్యునరేషన్ తీసుకుంటోందని ఇండస్ట్రీ టాక్.లియోకి 5 కోట్లు రెమ్యునరేషన్ దక్కినట్లు గతంలో టాక్ వచ్చింది. అలాగే సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరో బిగ్ ఇన్‌కమ్. ఏడాదికి దాదాపు 9 కోట్లు యాడ్స్ నుంచే వస్తున్నాయట. ఇక్కడే త్రిష తెలివి కనిపిస్తుంది. కేవలం స్కిన్ కేర్, బ్యూటీ బ్రాండ్స్ కాకుండా ఫైనాన్స్, జ్యువెలరీ, రియల్ ఎస్టేట్ కంపెనీలకు కూడా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంది. 40 ప్లస్ ఏజ్‌ని లయబిలిటీ కాకుండా అసెట్‌గా మార్చుకుంది. అందుకే బ్రాండ్స్ ఇప్పటికీ ఆమెనే నమ్ముతున్నాయి.సంపాదన ఎంత ముఖ్యమో, దాన్ని ఎక్కడ పెట్టాలో తెలియడం అంతకంటే ముఖ్యం. త్రిష ఆ విషయంలో పక్కా ప్లానింగ్‌తో ఉంది. చెన్నైలో 10 కోట్లకు పైగా విలువ చేసే ఇల్లు ఉందట. అలాగే హైదరాబాద్‌లో కూడా 6 కోట్ల ప్రాపర్టీ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 15 ఏళ్ల క్రితం కొన్న స్థలాలు ఇప్పుడు మూడు రెట్లు అయ్యాయి. మెర్సిడెస్, బీఎండబ్ల్యూ కార్స్ కలెక్షన్ తో ఆమె లెక్క 4 కోట్లు. ఇవన్నీ కేవలం షో కోసం కాదు. స్టార్ ఇమేజ్‌ని కాపాడుకుంటూనే లాంగ్ టర్మ్ వెల్త్ క్రియేట్ చేసుకునే మార్గాలని చెప్పవచ్చు. సినిమా ఫీజుని నేరుగా ల్యాండ్‌లోకి మళ్లించడం వల్లే నెట్ వర్త్ స్టడీగా పెరిగింది.హిట్స్ ఉన్నప్పుడు దాచుకోవడం, ఫ్లాప్స్ వచ్చినప్పుడు ప్యానిక్ కాకపోవడం, ట్రెండ్ మారిన ప్రతిసారీ తనని తాను మార్చుకోవడంతో అమ్మడు ఇంతకాలం ఇండస్ట్రీలో నిలబడింది అని చెప్పవచ్చు. అందుకే 1999 బ్యాచ్ హీరోయిన్స్ అందరూ సైడ్ అయిపోయినా, త్రిష మాత్రం 100 కోట్ల మార్క్‌కి దగ్గరగా వచ్చింది. స్టార్‌డమ్ టెంపరరీ, కానీ స్మార్ట్ ప్లానింగ్ పర్మనెంట్ అని ప్రూవ్ చేసింది.

### స్టైలిష్ లుక్ లో తమన్నా..

# ఇలా ఎప్పుడైనా చూశారా?

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న తమన్నా భాటియా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. షూటింగ్స్ తో బిజీగా ఉన్నప్పటికీ, అభిమానులతో టచ్ లో ఉండేందుకు ఆమె ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఫోటోలు, అభిప్రాయాలు పంచుకుంటూ వస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు, పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయిఇటీవల జరిగిన ఈు అత్యంత ప్రభావవంతమైన యువ భారతీయులు 2026 అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా, ఆ ఎక్స్పీరియన్స్ ను అభిమానులతో పంచుకున్నారు. ఆ సందర్భంగా ఆమె రాసుకొచ్చిన ఎమోషనల్ కామెంట్స్ అందరి దృష్టి ఆకర్షిస్తున్నాయి. ఆ ఈవెంట్ లో ఉన్న ఎన్విరాన్మెంట్, సహచరుల మధ్య ఉన్న అనుబంధం తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపించిందని పేర్కొంది'ఆ రాత్రి ఇప్పటికీ నా మనసులో ఉంది. అందరూ ఒకరికి ఒకరు సపోర్ట్ చేస్తూ, నిజమైన ఆనందాన్ని పంచుకున్నారు. విభిన్న రంగాల్లో ఉన్న వ్యక్తుల ప్రయాణాలను చూసి గర్వంగా అనిపించింది' అని ఆమె తన పోస్ట్ లో తెలిపారు. సహచరులు ఒకరిని ఒకరు అభినందించుకోవడం, ఎంకరేజ్ చేసుకోవడం వంటి అంశాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని వెల్లడించారు తమన్నాఅలాగే ఆ రోజు తాను ఎలా రెడీ అయ్యారో అమ్మడు వివరించారు. సాధారణంగా తొందరపడే తనకు, ఈసారి మాత్రం ప్రతి అంశాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా రెడీ అయ్యానని చెప్పింది. డ్రెస్సింగ్ నుంచి స్టైలింగ్ వరకు ప్రతి చిన్న విషయానికీ ఇంపార్టెన్స్ ఇచ్చినట్లు వెల్లడించింది. ఆ ప్రాసెస్ ను ఎంతో ఎంజాయ్ చేశానని తెలిపింది. ఆ ఈవెంట్ లో తమన్నా ధరించిన డ్రెస్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందిబ్లూ కలర్ లో క్రేజీ చెక్స్ డిజైన్ తో ఉన్న ఆ అవుట్ ఫిట్ లో ఆమె చాలా స్టైలిష్ గా కనిపించింది.



EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022